కోడేరు మండలం పసుపుల కొనుగోలు కేంద్రంలోని ధాన్యం రాశులు

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- **కాంటా పెట్టలేరు.. లారీల్లో తరలించడం లేదు..**
- **తడుస్తున్న ధాన్యం.. పట్టించుకోని నిర్వాహకులు**
- **ఆందోళనలో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల రైతులు**

కోడేరు, మే 25 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి 20 రోజులైనా లారీలు రావడం లేదనే సాకుతో కాంటా వేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ యాసంగి సీజన్‌లో ప్రభుత్వం కోడేరు మండలంలో 12ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఏ ఒక్క కేంద్రంలోనూ కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో రైతులు రోజుల తరబడి అక్కడే పడిగాపులుకాస్తున్నారు. కోడేరు, జనుంపల్లి, తీగలపల్లి, పసుపుల, బావాయిపల్లి, కొండ్రావుపల్లి, ఎత్తం, నర్సాయపల్లి, మైలారం, నాగులపల్లి, రాజాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే అక్కడ సరిపడా గన్నీ బ్యాగులు లేవని, కొనుగోలు చేసిన ధాన్యం లోడింగ్ కోసం లారీలు రావడం లేదని నిర్వాహకులు సాకులు చెప్పుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో పక్షపాతం చూపిస్తూ.. నిర్వాహకులు తమకు అనుకూలంగా ఉన్న వారి ధాన్యం ముందుగా కాంటా వేసి.. మిగతా వారిని పట్టించుకోవడం లేదని, పైగా తేమశాతం పేరుతో సాకులు చెప్తూ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

ఎరువుల్లేవ్.. విత్తనాల్లేవ్

మొదటిపేజీ తరువాయి...

అందుబాటులో లేవని తెలుస్తున్నది. ముఖ్యంగా యూరియా, పత్తి విత్తనాల కొరత ఏర్పడే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాఖ అధికారులే ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ వానకాలంలో 1.34 కోట్ల ఎకరాల్లో పంటల సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. ఇందులో అత్యధికంగా 66.8 లక్షల ఎకరాల్లో వరి, 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 50 లక్షల ఎకరాల్లో పత్తి, 9 లక్షల ఎకరాల్లో సోయా పంటలు సాగవుతాయని అంచనా వేసింది.

యూరియా కొరత తప్పదా?

ఈ సీజన్‌కు 9.8 లక్షల టన్నుల యూరియా అవసరమని అంచనా. అయితే ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు, ప్రభుత్వం వద్ద కలిపి 3.17 లక్షల టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నట్టు తెలిసింది. రైతులు ఎక్కువగా యూరియా కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) మీద ఆధారపడతారు. ప్యాక్స్‌కు యూరియాను సరఫరా చేసే మార్క్‌ఫెడ్ వద్ద నిల్వలు అడుగంటినట్టు తెలిసింది. సీజన్‌కు ముందే మార్క్‌ఫెడ్ వద్ద సుమారు 4లక్షల టన్నుల బఫర్ స్టాక్ ఉండాలి. కానీ, శనివారం నాటికి 1.72 లక్షల టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నది. ఉండాల్సిన దానికన్నా 2.28లక్షల టన్నులు తక్కువగా ఉన్నది. ఈ కొరతకు తోడు కేంద్రం నుంచి రావాల్సిన యూరియా రావడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలకు కలిపి 3.3 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి రావాల్సి ఉండగా 1.72లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. అంటే 1.58 లక్షల టన్నులు తక్కువగా వచ్చింది. ఈ విధంగా మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ నిల్వలు తక్కువగా ఉండి, కేంద్రం నుంచి రావాల్సిన యూరియా రాకపోవడంతో రాష్ట్రంలో యూరియా కొరత తప్పదనే ఆందోళన వ్యవసాయ శాఖ అధికారుల్లో వ్యక్తమవుతున్నది. ఈ ప్రభావం సాగుపై పడుతుందని, రైతులకు ఇబ్బంది తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విత్తనాలకూ కొరతే

ఎరువులతోపాటు విత్తనాలకు కూడా కొరత తప్పేలా కనిపించడం లేదు. ముఖ్యంగా గత సంవత్సరం మాదిరిగానే పత్తి, పచ్చిరొట్ట విత్తనాలకు తిప్పలు తప్పేలా లేవు. ఈ సీజన్‌లో 50లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేశారు. ఇందుకోసం కనీసం కోటిన్నర పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం. అయితే వ్యవసాయ శాఖ మాత్రం 2.4 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందించింది. కానీ, ప్రస్తుతం 40 లక్షల విత్తన ప్యాకెట్లు మాత్రమే క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నట్టు అధికారులు తెలిపారు. దీనికితోడు పచ్చిరొట్ట విత్తనాల విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం 1.94 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశిస్తే.. విత్తనాభివృద్ధి సంస్థ 97 వేల టన్నులకు మాత్రమే ప్రణాళిక రూపొందించింది. ఇందులో ప్రస్తుతం సగం విత్తనాలే క్షేత్రస్థాయికి చేరినట్టు తెలిసింది. పలు జిల్లాల్లో రైతుకు పచ్చిరొట్ట విత్తనాలు ఒక్క సంచి మాత్రమే ఇస్తున్నట్టు సమాచారం. అది కూడా క్యూలైన్లలో నిలబడితే గానీ లభించడం లేదని చెప్తున్నారు.

ముందుకొచ్చిన సీజన్

గతంతో పోల్చితే ఈ ఏడాది సీజన్ చాలా ముందుకొచ్చింది. సాధారణంగా జూన్ మొదటి వారంలో కేరళను తాకే రుతుపవనాలు ఇప్పటికే వచ్చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా తొలకరి జల్లులు కురుస్తున్నాయి. దీంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. అధికారులు మాత్రం మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేగంగా కదలడం లేదు. జూన్ ప్రణాళిక ప్రకారమే పనిచేస్తున్నారు. ఇప్పుడు సీజన్ సుమారు 20 రోజులు ముందుకు రావడంతో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఓపీఎస్ సాధనకు సమైక్య పోరాటం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దుచేసి, పాత పెన్షన్ స్కీం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ సాధనకు అన్ని రాష్ట్రాల్లోని ఉపాధ్యాయ సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఏఐఎఫ్‌టీవో) జాతీయ కార్యవర్గ సమావేశం జార్ఖండ్‌లోని దేవఘడ్‌లో నిర్వహించారు. సమావేశానికి రాష్ట్రం నుంచి శ్రీపాల్‌రెడ్డితోపాటు పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, ఏఐఎఫ్‌టీవో బాధ్యులు గీత, త్రివేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు. శ్రీపాల్‌రెడ్డి మట్లాడుతూ.. రాష్ట్రంలో టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని జిల్లాల టీచర్లను సమైక్యం చేస్తున్నామని, శాసనమండలిలోనూ టీచర్ల సమస్యలను లేవనెత్తేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని వెల్లడించారు. టీచర్ల సమస్యల పరిష్కారంలో మెతక వైఖరి, రాజీ ధోరణి అనుసరించబోమని స్పష్టంచేశారు.

కాళేశ్వరం మరమ్మతు ఖర్చులు భరించేదెవరు?

ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

హైదరాబాద్ మే 25 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతు ఖర్చులు భరించేది ప్రభుత్వమా? లేక కాంట్రాక్టర్లా? అని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానం చెప్పాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ ప్రభుత్వం విచారణ పేరిట హంగామా చేస్తుండగా, కాంట్రాక్టర్లు మాత్రం మరమ్మతు ఖర్చులు ప్రభుత్వమే భరించాలంటూ లేఖ రాయడం పలు అనుమానాలకు తావిస్తున్నదని ఆదివా రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

మొలకెత్తిన ధాన్యమూ పశువుల మేతకే

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపల్లిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు పోసి రోజులు గడుస్తున్నా కాంటా పెట్టకపోవడంతో వర్షాలకు మొలకలు వచ్చాయి. కొందరు మొలకలు వేరు చేసి ఆరబెట్టగా, మరికొందరు ఇలా మూగజీవాలకు మేతగా వదిలేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. – రాయికల్

పొగాకు పంటకు నిప్పు

గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్

రాఘవాపూర్, కుర్చపల్లిలో ఆందోళన

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి, మే 25: గిట్టుబాటు ధర కోసం జనగామ జిల్లాలో పొగాకు రైతులు రోడ్డెక్కారు. క్వింటాల్‌కు రూ.18వేల ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్ వద్ద జాతీయ రహదారిపై, రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో పొగాకు పంటకు నిప్పుపెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వీఎస్టీ, డెక్కన్ కంపెనీలు క్వింటాల్ పొగాకు రూ.18వేలు ధర పలుకుతుందని చెప్పడంతో సాగు చేశామని, పంట చేతికొచ్చాక క్వింటాల్‌కు రూ.3వేలు మాత్రమే ఇస్తామంటున్నారని చాగల్లు క్లస్టర్ పరిధిలోని రాఘవాపూర్ రైతులు వాపోయారు. పండించిన పొగాకును కొనుగోలు చేయకపోతే అప్పులు ఎలా తీరుతాయని ప్రశ్నించారు. వానలకు పొగాకు దెబ్బతింటున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. గిట్టుబాటు ధరకు ఆయా కంపెనీలు పొగాకు కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో రైతులు చేపట్టిన ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి మాట్లాడుతూ.. గిట్టుబాటు ధర కల్పించి పొగాకు రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో పొగాకును దహనం చేస్తున్న రైతులు

ముగిసిన అంగన్‌వాడీ కోడిగుడ్ల టెండర్ల గడువు

హైదరాబాద్ మే 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా టెండర్ల గడువు ఆదివారంతో ముగిసిందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మూడు సార్లు టెండర్ల గడువు పొడిగించిన ప్రభుత్వం టెండర్లను ఓపెన్ చేసి తక్కువకు కోట్ చేసిన వారికి కోడిగుడ్ల సరఫరా బాధ్యతలను అప్పగిస్తుందా?.. లేక మళ్లీ పొడిగిస్తుందా అనే విషయంపై రెండ్రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది.

'వీఏఏ' నూతన అధ్యక్షుడిగా రంగారావు

కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న 'వీఏఏ'

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): వెలమ అసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా (వీఏఏ) నూతన అధ్యక్షుడిగా రంగారావు రంగినేని నియామకమయ్యారు. ఈ మేరకు ఆస్ట్రేలియాలో ఆదివారం కొత్త నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన రెండేండ్లపాటు (2027వరకు) ఈ పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను సంఘానికి నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. నూతన కార్యవర్గానికి మాజీ అధ్యక్షుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కాగా, ఈ సంఘం 2018లో ఏర్పాటై.. ఆస్ట్రేలియా గడ్డపై తెలంగాణ సంస్కృతిని చాటడంతోపాటు, నిరుపేదలు, పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్నది.

నూతన కార్యవర్గం సభ్యులు వీరే..

'వీఏఏ' వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్హార్‌రావు సాయినేని, వైస్ ప్రెసిడెంట్‌గా మధుకర్‌రావు రాచమడుగు, జనరల్ సెక్రటరీగా ఎం అనిల్‌రావు, పీఆర్‌వోగా వంశీ గోనె, ట్రెజరర్‌గా కిషన్‌రావు చెప్యాల, జాయింట్ సెక్రటరీగా రామ్‌శంకర్‌రావు బోయినపల్లి నియామకమయ్యారు.

సీనియర్ పాత్రికేయుడు మునీర్ కన్నుమూత

- **సింగరేణి జేఏసీ చైర్మన్‌గా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర**
- **మునీర్ మృతిపై మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి**
- **సంతాపం ప్రకటించిన సీఎం, పలువురు మంత్రులు**

మునీర్ (ఫైల్)

మంచిర్యాల టౌన్/హైదరాబాద్ మే 25 (నమస్తే తెలంగాణ): మంచిర్యాలకు చెందిన సీనియర్ పాత్రికేయుడు ఎండీ మునీర్ (68) శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో కన్నుమూశారు. ఆదివారం భౌతికకాయాన్ని మంచిర్యాలలోని ఆయన నివాసానికి తీసుకువచ్చారు. మునీర్ ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లో స్టాఫ్ రిపోర్టర్‌గా, టీయూడబ్ల్యూజే 143 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, మంచిర్యాల ప్రెస్‌క్లబ్ అ్యక్షుడిగా పనిచేశారు. సింగరేణి జేఏసీ చైర్మన్‌గా కార్మికులను తెలంగాణ ఉద్యమంలో మమేకం చేశారు. మునీర్‌కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సాయంత్రం ఆయన భౌతికకాయాన్ని మందమర్రికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఎమ్మెల్సీ కోదండరాం, టీబీజీకేఎస్ నాయకుడు కెంగర్ల మల్లయ్య, సీపీఐ నాయకులు హాజరయ్యారు.

మునీర్ మరణం బాధాకరం : కేసీఆర్

సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ మరణం బాధాకరమని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన పాత్రికేయుడిగా కార్మికుల సమస్యలను వెలుగులోకి తేవడంలో ఆయన ముఖ్యభూమిక పోషించారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ప్రాంత ప్రజాసంఘాలు, ఉద్యమ శక్తులను ఏకంచేసి ప్రత్యేక తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మునీర్ మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సింగరేణి, ఉత్తర తెలంగాణలో జరిగిన అనేక కార్మిక ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచారని, ఆయన మృతి తీరనిలోటని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా సింగరేణి సకల జనులసమ్మె సందర్భంగా మునీర్ పోషించిన పాత్రను కొనియాడారు. మునీర్ మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, గడ్డం వంశీకృష్ణ, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, కోనేరు కోనప్ప, కార్మిక సంఘాల నాయకులు, పాత్రికేయులు సంతాపం ప్రకటించారు.

నిజాంసాగర్‌లోకి 436 క్యూసెక్కులు

వానలతో పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బాన్సువాడ / నిజాంసాగర్, మే 25: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మంజీరాలో స్వల్ప వరద మొదలైంది. మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అడపదడపా వానలకు కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. శంకరంపేట్, జోగిపేట్ తదితర ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ఆదివారం ప్రాజెక్టులోకి 436 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని ప్రాజెక్టు ఏఈఈ శివప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు (1405.00 అడుగులు) గాను ప్రస్తుతం 5.706 టీఎంసీల (1393.26 అడుగులు) నీరు నిల్వ ఉన్నదని పేర్కొన్నారు.

త్రివేణి సంగమంలో పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు

పుష్కరాలకు పోటెత్తిన భక్తజనం

- **కిక్కిరిసిన ఆలయ పరిసరాలు**
- **త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు**
- **15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్**
- **పుణ్యస్నానమాచరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు**

మహదేవపూర్, (కాళేశ్వరం) మే 25: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలు ఆదివారం నాటికి 11వ రోజుకు చేరింది. సెలవురోజు కావడంతో వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. నది, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేకువజామునే భక్తులు త్రివేణి సంగమానికి చేరుకొని పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఈనెల 15న ప్రారంభమైన పుష్కరాలు సోమవారంతో ముగియనుండటంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. భక్తులతో త్రివేణి సంగమం, ఆలయ పరిసరాలు, రహదారులు, పార్కింగ్ ప్రదేశాలు కిక్కిరిసిపోయాయి. కాళేశ్వరం నుంచి సుమారు 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. కాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎస్ వాణీదేవి తదితరులు పుణ్యస్నానాలు ఆచరించి దర్శనం చేసుకున్నారు. చివరి రోజైన సోమవారం భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

2న పంచాయతీ ఎన్నికలపై ప్రకటన?

- **ఉన్నతాధికారులతో సీఎం భేటీ**
- **ఎన్నికల నిర్వహణపై సమాలోచన**
- **సన్నబియ్యం, రేషన్‌కార్డులు, రాజీవ్ యువవికాసంపైనే ఆశలు**
- **ఆలస్యమైతే ఇంకా నష్టమనే భయం**

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వ పెద్దలు కీలక ప్రకటన చేయనున్నట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత జూన్ 5లోగా స్టేట్ ఎలక్షన్ కమిషన్ (ఎస్ఈసీ) నుంచి ఈ మేరకు ప్రకటన రావచ్చని పేర్కొన్నాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (పీఆర్) కమిషనర్ సృజన, ఇతర ఉన్నతాధికారులతో తాజాగా సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. పంచాయతీ ఎన్నికలు జరపాలని ఎమ్మెల్యేల నుంచి ఒత్తిడి వస్తున్నదని సీఎం తెలుపగా, ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసి ఉంచామని అధికారులు చెప్పినట్టు సమాచారం. బ్యాలెట్ పేపర్లు సైతం ముద్రించి సిద్ధంగా ఉంచామని చెప్పినట్టు తెలిసింది. సీఎంతో భేటీ అనంతరం తొలిసారిగా కమిషనర్ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఇతర ముఖ్య అధికారులతో మాట్లాడినట్టు అధికారవర్గాలు సైతం వెల్లడించాయి. ఏ సమయంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడవచ్చని, సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపాయి.

ఆలస్యమైతే మరింత నష్టం

రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసి ఏడాది దాటిపోయింది. కేంద్రం, 15వ ఫైనాన్స్ నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన నిలిచింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి 15 నెలలు దాటింది. అయినా, ఎన్నికలు నిర్వహించకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామీణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇంకా ఆలస్యమైతే మరింత నష్టం జరిగే అవకాశం ఉంటుందని ప్రభుత్వ పెద్దలకు ఫీడ్‌బ్యాక్ అందింది. ఫలితాలు ఎలా వచ్చినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు తమ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్తారని, తమపై కాస్త ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. వెంటనే ఎన్నికలకు వెళ్లాలని కొందరు ఎమ్మెల్యేలు ఒత్తిడి కూడా తీసుకొస్తున్నట్టు తెలిసింది. సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ, యువవికాసం వంటి పథకాల అమలు అంశం కలిసి వస్తుందని కూడా హస్తం నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఆ పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం, డిప్యూటీ సీఎం పలు సూచనలు ఇచ్చారు.

జంబో కార్యవర్గం కుదరదు!

- **పీసీసీ జాబితాను తిరస్కరించిన రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్**
- **ఢిల్లీలోనే ఉండి తుది జాబితాపై కసరత్తు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్**
- **నేడు కేసీ వేణుగోపాల్‌తో భేటీ?**

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): నలుగురు పీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు, 35 మందికిపైగా ఉపాధ్యక్షులు, 70 మందికిపైగా ప్రధాన కార్యదర్శులతో రూపొందించిన జంబో పీసీసీ కార్యవర్గం జాబితాను కాంగ్రెస్ అధిష్ఠానం తిరస్కరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇంత పెద్ద పీసీసీ కమిటీతో వ్యక్తులకు మినహా పార్టీకి ఎలాంటి ప్రయోజనం ఉండదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అభ్యంతరం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించి.. చివరకు 105మంది ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో కూడిన జాబితాతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం ఢిల్లీ వెళ్లారు. ఈ లిస్టును కాంగ్రెస్ హైకమాండ్‌కు అందజేసినట్టు తెలిసింది. ఈ జాబితా పట్ల మీనాక్షి నటరాజన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసినట్టు తెలిసింది. అనంతరం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. టీపీసీసీ కమిటీ జాబితాను ఆయనకు అందజేసి, మీనాక్షి నటరాజన్ వ్యక్తంచేసిన అభ్యంతరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. కేసీ వేణుగోపాల్ కూడా మీనాక్షి అభ్యంతరాలతో ఏకీభవిస్తూ.. జాబితాను కుదించి తీసుకురావాలని సూచించినట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. దీంతో ఇద్దరు నేతలు కూడా ఆదివారం రాత్రి ఢిల్లీలోనే ఉండి, మరోసారి జాబితాపై పునఃసమీక్ష చేసుకొని, పరిమిత సభ్యులతో కార్యవర్గాన్ని రూపొందించి సోమవారం మరోమారు కేసీ వేణుగోపాల్‌ను కలిసే అవకాశం ఉన్నదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

ఐదేండ్ల తర్వాత అఫ్గాన్ పౌరులకు భారత్ వీసాలు

న్యూఢిల్లీ, మే 25: భారత్–అఫ్గానిస్థాన్ మధ్య దౌత్య సంబంధాలు కాస్త మెరుగుపడుతున్నాయి. దాదాపు ఐదేండ్ల తర్వాత అఫ్గాన్ పౌరులకు వీసాలు జారీచేయటాన్ని భారత్ పునరుద్ధరించింది. కళాకారులు, బంధువులకు ఇచ్చే ఎంట్రీ వీసాలు, వర్తక, వ్యాపారులు, వైద్య నిపుణులు, ఇతరులు.. ఇలా వివిధ క్యాటగిరీలకు చెందిన అఫ్గాన్లకు భారత్ ఇకపై వీసాలు జారీచేయబోతున్నది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ భారత ప్రభుత్వ అధికారిక పోర్టల్ 'ఇండియా వీసా ఆన్‌లైన్'లో విడుదలైంది. 'న్యూ అఫ్గాన్ వీసా' మోడల్‌ను గత నెలలోనే ప్రవేశపెట్టినట్టు ఆ నోటిఫికేషన్‌లో భారత్ పేర్కొన్నది. అఫ్గానిస్థాన్‌ను తాలిబాన్ పూర్తిగా స్వాధీనం చేసుకున్నాక.. వీసాల జారీని భారత్ నిలిపివేసింది. దీంతో గత కొన్నేండ్లుగా అఫ్గాన్లకు వీసాల జారీ నిలిచిపోయింది.

అడ్మిషన్ల వేళాయె.. అనుమతులు రావాయె

- **25% కాలేజీలకే అనుమతులు!**
- **జూన్ 2 నుంచే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం**
- **సమీపిస్తున్న అడ్మిషన్ల గడువు**
- **పలు ప్రైవేటు కాలేజీల ఇష్టారాజ్యం**
- **గుర్తింపు లేకుండానే అడ్మిషన్లు తీసుకుంటున్నవైనం**

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ కాలేజీల గుర్తింపు ప్రక్రియ(అఫిలియేషన్లు) ముందుకుసాగడం లేదు. దీంతో అఫిలియేషన్లు పూర్తయ్యేదెప్పుడు.. విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించేదెప్పుడు అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు ఇంటర్‌బోర్డు ఏటా అనుబంధ గుర్తింపు జారీ చేస్తుంది. ఆదివారం వరకు 746 కాలేజీలకు మాత్రమే ఇంటర్‌బోర్డు గుర్తింపును జారీచేసింది. ఈ ఏడాది 3,064 కాలేజీలు ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 25% కాలేజీలకు మాత్రమే అఫిలియేషన్లు దక్కాయి. పదో తరగతి ఫలితాలు విడుదల కావడంతో ఈ నెల 1 నుంచే ఫస్టియర్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నారు. మొదటి విడత అడ్మిషన్ల దరఖాస్తుల గడువు ఈనెల 31తో ముగియనున్నది. జూన్ 2 నుంచి క్లాసులు ప్రారంభంకానున్నాయి. అఫిలియేషన్లు పూర్తికాకపోవడం, కొత్త విద్యాసంవత్సరం తరుముకొస్తుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

ప్రైవేట్ కాలేజీల ఇష్టారాజ్యం..

రాష్ట్రంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇంటర్‌బోర్డు నుంచి గుర్తింపు జారీకాకముందే అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 171ప్రైవేట్ కాలేజీలకు మాత్రమే ఇంటర్‌బోర్డు గుర్తింపు ఇచ్చింది. దాదాపు 1,250 కాలేజీలకు ఇంకా గుర్తింపు ఇవ్వలేదు. ఈ కాలేజీల గుర్తింపు పెండింగ్‌లోనే ఉంది. అఫిలియేషన్ లేకుండా అడ్మిషన్లు తీసుకోవడం ఇంటర్‌బోర్డు నిబంధనలకు విరుద్ధం. ఆయా కాలేజీలపై చర్యలు తీసుకుంటామని బోర్డు హెచ్చరించింది. అయినా కూడా ఖాతరు చేయడంలేదు.